క్లుప్తంగా

జాబ్‌మేళాను విజయవంతం చేయాలి

వైరా: ఈ నెల 24న వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను విజయవంతం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. సోమవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవర్గంలోని ఐదు మండలాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌మేళా గురించి అన్ని మండలాల్లో విస్తృత ప్రచారం చేయించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సరస్వతీ నది పుష్కరాల్లో ఎమ్మెల్యే..



కాళేశ్వరాలయంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కుటుంబ సభ్యులు

వైరా: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుటుంబ సమేతంగా సోమవారం సరస్వతీ నదీ పుష్కరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమమైన కాళేశ్వరంలో పుష్కర స్నానం చేసి స్వామిని దర్శించుకుని.. వైరా నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు.

ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

మధిర: మధిర పట్టణంలోని శ్రీ షిరిడి సాయి బాబా మందిర ఆవరణలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 21, 22 తేదీల్లో స్వామి పంచమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు దివ్య సాయి సేవా ట్రస్ట్ నిర్వాహకులు పబ్బతి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న గణపతి పూజ, పుణ్యాహవచనం తదితర పూజలు ఉంటాయని తెలిపారు. 22న ప్రసన్నాంజనేయ స్వామి విశేషాలంకరణ, సువర్చలా సమేత హనుమత్ కళ్యాణం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


బాలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహం

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ధ్వజస్తంభం, శ్రీ బాలాంజనేయ స్వామి విగ్రహాన్ని వేద పండితులు ప్రభాకరాచార్యులు, సంపత్ కుమారాచార్యులు సోమవారం అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు భరత్ కుమార్ శర్మ, తదితర భక్తులు పాల్గొన్నారు.

అన్నాభిషేకం, మామిడి పండ్లతో అర్చన



108 మామిడి పండ్లతో స్వామికి అర్చన

తల్లాడ: తల్లాడ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో వైశాఖ మాస బహుళ సప్తమి మూడో సోమవారం మామిడి పండ్లతో అర్చన, అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం చేశారు. అనంతరం 108 మామిడి పండ్లతో అర్చన చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, జమలాపురం, ములుగుమాడు, భీమవరం, సఖినవీడు, పెద్దగోపవరం, గుంటుపల్లి గోపవరం గ్రామాలకు చెందిన పలువురికి రూ.4లక్షల విలువైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు సోమవారం జమలాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాసరావు, నాగిరెడ్డి, కృష్ణారావు, రాజీవ్‌గాంధీ, వెంకటరెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. అవగాహన

- వన విజ్ఞానం పెంపొందించేలా పాఠాలు
- అర్బన్‌పార్క్‌లో ముగిసిన సమ్మర్ క్యాంప్



ఆటవస్తువులతో..

సత్తుపల్లిటౌన్: ఏ మొక్కలో ఏ ఔషధగుణాలున్నాయో వివరిస్తూనే.. అడవులు విలువను చాటి చెబుతూ ఆట వస్తువులతో ఆహ్లాదం పంచుతూ అటవీశాఖ.. విద్యార్థుల్లో వన విజ్ఞానాన్ని వికసింపజేస్తోంది. ఈ నెల 13 నుంచి 19వ వరకు సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్‌పార్క్‌లో నిర్వహించిన వన విజ్ఞాన చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్ సోమవారం ముగిసింది. ఈ శిబిరంలో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు వారం రోజుల పాటు అడవిపై అవగాహన పెంపొందించారు. ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల పర్యవేక్షణలో రేంజర్ స్నేహలత ఆధ్వర్యాన డీఆర్‌ఓ ముత్యాలరావు, ఉద్యోగులు పిల్లలకు అటవీ విజ్ఞానాన్ని అందించడంలో నిమగ్నమయ్యారు, అడవుల ప్రాముఖ్యత, వన్య ప్రాణుల సంరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, చెట్ల విలువ, మొక్కల ఆవశ్యకతలపై విద్యార్థులకు వన విలువలను పెంపొందించి.. పిల్లల ద్వారా తల్లిదండ్రుల్లో అడవులపై మమకారం కల్పించేందుకు అటవీశాఖ ఈ కార్యాచరణ చేపట్టింది.

అందాలను ఆస్వాదిస్తూ..

సుమారు 350 ఎకరాల విస్తీర్ణంలోని ఈ నీలాద్రి అర్బన్‌పార్క్‌లో ఫెడల్ బోటింగ్, వాచ్ టవర్, వాకింగ్ ట్రాక్, పగోడా, నచ్చ బండలు, సెల్ఫీ పాయింట్ వద్ద సీతాకోక చిలుక, తాబేలు బొమ్మలు.. వంటి అందాలను ఆస్వాదిస్తూ పిల్లలు ఆనందంగా గడిపారు.



గీసిన చిత్రాలతో విద్యార్థులు

సమ్మర్ క్యాంప్‌లో..

విద్యార్థులకు యోగా, నర్సరీలో మొక్కలు పెంచటం, గ్రాస్ వాక్, ట్రెక్కింగ్, పేపర్ బొమ్మల తయారీ, ఇంగ్లీష్ అక్షరమాల ఆధారంగా మొక్కలు, మంచి అలవాట్లు, మియావాకీ.. తదితర అంశాలు వివరించారు. లాన్ బ్రేక్‌ఫాస్ట్, స్నాక్స్ అందిస్తూ పిల్లలో వన సందేశాన్ని నింపారు.

అవగాహన పెంచేందుకే..



అడవులు, వన్య ప్రాణుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. విద్యార్థుల్లో అడవులపై అవగాహన కల్పించడం కోసమే ఈ వన విజ్ఞాన చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్ నిర్వహించాం. పిల్లలకు అల్పాహారం, స్నాక్స్ పెట్టి ఉచితంగా పార్కు ఆహ్లాదాన్ని అందించాం.

– వాడపల్లి మంజుల, ఎఫ్‌డీఓ, సత్తుపల్లి

ఆనందంగా గడిపాం..



పర్యావరణ అంశాలతో పాటు మొక్కల వివరాలను చక్కగా చెప్పారు. అడవుల ఆవశ్యకతను వివరించారు. జంతువులు, సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇక్కడి ఆటవస్తువులతో పాటు పార్కు అందాలను చూస్తూ చాలా ఆనందంగా గడిపాం.

– ఎల్.ఆరోహి, విద్యార్థిని, సత్తుపల్లి

విద్యుత్ సరఫరా పున:ప్రారంభం

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండాలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం ఇచ్చిన దాతకు ఉద్యోగం ఇస్తామని చెప్పిన అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీ విస్మరించారని ఇటీవల ఓ మహిళ ఆందోళనకు దిగి విద్యుత్ సరఫరా నిలిపివేసిన విషయం తెలిసిందే. దీంతో సుమారు వారం రోజులపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. అధికారులు ప్రత్యామ్నాయంగా కారేపల్లిక్రాస్‌రోడ్డు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫారా చేస్తున్న సంగతి విధితమే. లోఓల్టేజీ కారణంగా ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు సోమవారం మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్ ఆధ్వర్యంలో ఖమ్మం గ్రావెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించగా.. తక్షణమే సరఫరా అందించాలని ఆదేసించారు. సింగరేణి తహసీల్దార్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఎఎస్సై నాగరాజకుమారి, హెడ్‌కానిస్టేబుల్ నాగేంద్రబాబు, పోలీసు సిబ్బంది, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను పున:ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు జగన్, గ్రామస్తులు రాజేష్, హారు, బన్సిలాల్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ వద్ద సింగరేణి తహసీల్దార్ సంపత్‌కుమార్, విద్యుత్ అధికారులు

కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం

కల్లూరు: స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్ఆర్ఐ తేజస్విని, గుంటూరు నుంచి కడియాల శివప్రసాదరావు, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరు శ్రీవ్యాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరిని గౌరవిస్తేనే మనకు అదే గౌరవం లభిస్తుందన్నారు. ఇంత తక్కువ సమయంలో మొత్తం 35మంది విద్యార్థులకు రూ.40 లక్షలు సాయం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు, వేము సులోచన, ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు, వాలంటీర్లు ఉబ్బన బాబూరావు, జల్ది రామకృష్ణ, సత్యవతి, శిరసాని రామ్మోహన్, గంపల శ్రీనివాసరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, దాతలు

నాణ్యమైన విత్తనాలను కొనాలి

తల్లాడ: రైతులు విత్తనాల కొనుగోళ్లలో తగు జాగ్రత్తలు పాటించి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఎంఈఓ ఎండి.తాజుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులు నాణ్యమైన విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైసెన్స్ డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, బిల్లులు పొందాలన్నారు.

క్షతగాత్రుడికి రూ.30వేల ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న యువసేవా సమితి బాధ్యులు

సత్తుపల్లిటౌన్: యువసేవా సమితి ఆధ్వర్యాన దమ్మపేటకు చెందిన తాళ్ల దేవేందర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని సర్జరీ కోసం క్షతగాత్రుని తండ్రి తాళ్ల శంకర్ యువసేవా సమితిని సంప్రదించగా దాతల నుంచి విరాళాలు సేకరించి రూ.30వేలను సోమవారం కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకులు రాజు, నరేష్‌కుమార్, రామనరేష్, మహ్మద్ అబ్దుల్, రోహిత్, చందు, కార్తీక్ పాల్గొన్నారు.

వెంకన్న కుటుంబానికి రూ.5వేలు..




నగదు, బియ్యం అందిస్తున్న గౌసుద్దీన్

కారేపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కారేపల్లి భారత్‌నగర్ కాలనీకి చెందిన వీఆర్ఏ వేమూరి వెంకన్న కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా మైనార్టీసెల్ నాయకుడు షేక్.గౌసుద్దీన్ రూ.5వేలు ఆర్థిక సాయంతో పాటు, 50కేజీల బియ్యం వితరణగా అందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వరరావు, మాజీ వార్డు సభ్యులు సత్యనారాయణ, ఖలీలుల్లాఖాన్, నాగమణి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల మదిలో చేదు జ్ఞాపకాలు

మధిర: మధిర మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం (నక్కలగరుబు) గ్రామం 1969 మే19న వచ్చిన వరద ఉధృతికి గ్రామం కొట్టుకుపోయింది. నాటి చేదు జ్ఞాపకాలను గ్రామస్తులు సోమవారం గుర్తు చేసుకున్నారు. ఆనాడు పగలంతా కురిసిన భారీ వర్షానికి వైరా నది పొంగి.. లోతట్టు గ్రామమైన బుచ్చిరెడ్డి పాలెం కొట్టుకుపోయి 42మంది మృతి చెందారు. ఆ సమయంలో సుమారు 40గంటల పాటు గ్రామానికి చెందిన యరదేశి తిరుపతయ్య, వంగూరి కృష్ణమూర్తి తదితరులు చింతచెట్టు ఎక్కి తమ ప్రాణాలు దక్కించుకున్నారు. పలువురు మధిర బ్రిడ్జిని పట్టుకుని తమ ప్రాణాలు దక్కించుకున్నారు. మరికొంతమంది సరిహద్దులో ఉన్న వంగవీడు గ్రామానికి వెళ్లి తలదాచుకున్నారు. ఆ తర్వాత వాసిరెడ్డి వెంకటపతి చొరవతో ఎత్తయిన ప్రాంతానికి తరలివెళ్లి నూతనంగా గ్రామాన్ని నిర్మించుకున్నారు.



నక్కలగరుబు గ్రామం

ఫిట్‌నెస్ లేకపోతే చర్యలు

వైరా: స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేకపోతే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని వైరా ఎంవీఐ వరప్రసాద్ హెచ్చరించారు. సోమవారం వైరాలో ఎంవీఐ కార్యాలయంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై సోమవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. జూన్ 12 నుంచి పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా యాజమాన్యాలు తమ బస్సులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. లేకపోతే బస్సులు సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంవీఐ వరప్రసాద్

భూముల రీసర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషాశారద

ఎర్రుపాలెం: తెలంగాణ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద రెవెన్యూ భూముల రీసర్వేకి ఎంపిక కాబడిన ములుగుమాడు రెవెన్యూ గ్రామంలోని రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ ఎం.ఉషాశారద, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే శ్రీనివాసులు కోరారు. సోమవారం మండలంలోని ములుగుమాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్లు, మొత్తం విస్తీర్ణం గురించి వివరించారు. భూముల సరిహద్దుల గుర్తింపు విషయంలో అధికారులకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ రవికుమార్, సర్వేయర్ రాజశేఖర్, తదితరులున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రుపాలెం: ప్రభుత్వం రైతు సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఉషా శారదకు వినతిపత్రం అందించారు. తొలుత ఏజేకేఎం జూనియర్ కళాశాలలో నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అధిక దిగుబడులు సాధించిన అన్నదాతలకు సరైన గిట్టుబాటు ధరలేక నష్టపోయారన్నారు. కేంద్రం ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి శూన్యమన్నారు. దుమ్ముగూడెం సీతారాం ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలనిర, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వీరయ్య, నాయకులు ప్రభాకర్, కోటేశ్వరావు, హనుమంతురావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



గాంధీనగర్‌కాలనీలో ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గాంధీనగర్ కాలనీలో నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానిస్తూ అప్రజాస్వామ్య పాలన సాగిస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగార్జున్, కోటేశ్వరరావు, వీరభద్రం, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాలల హక్కుల సాధనకు పోరాడుదాం

వైరా: మాలల హక్కుల కోసం పోరాడుదామని యూనిట్ ఆఫ్ మాల సంఘం నాయకులు స్పష్టం చేశారు. సోమవారం వైరాలోని సీపీఐ కార్యాలయంలో యూనిట్ ఆఫ్ మాల సంఘం అధ్యక్షుడు అప్పం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 8న ప్రతి గ్రామం, పట్టణంలో యూనిట్ ఆఫ్ మాల నూతన కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవి, సైదులు, రమేష్, చిన్ని, అశోక్, రాజు, శ్రీను, శ్రీకాంత్, కృష్ణ, వీరబాబు, అర్జునరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

మధిర: మధిర తహసీల్, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బందికి సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ పాల్గొని సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమానికి హాజరైన ప్రజలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుబ్బలక్ష్మి, వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ కేసు నమోదు

కల్లూరు: కల్లూరు మండలంలో బాల్య వివాహం చేయనున్నారనే సమాచారం మేరకు సీడీపీఓ మరియు సిబ్బంది బాల్య వివాహం చేయుచున్న తల్లిదండ్రులను సోమవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ కేసు నమోదు చేశారు.

సారా తయారుచేస్తున్న ఇద్దరి బైండోవర్..

కల్లూరురూరల్: మండలంలోని లక్ష్మీపురంలో కాపుసారా తయారుచేస్తున్న గుగులోతు భద్రు, ఇస్లావత్ భద్రును ఎక్సైజ్‌శాఖ అధికారులు సోమవారం తహసీల్దార్ పులి సాంబశివుడు ఎదుట బైండోవర్ చేశారు. మరోమారు సారా తయారు చేస్తే రేషన్‌కార్డు రద్దు చేయడమే కాక జైలుశిక్ష విధిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు



దుస్తుల తయారీని పరిశీలిస్తున్న రాజశేఖర్

కల్లూరురూరల్: జూన్ 1వ తేదీ నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజశేఖర్ తెలిపారు. సోమవారం కల్లూరు, ముచ్చవరం, నారాయణపురం, పాయపూర్‌లలో ఏకరూప దుస్తుల తయారి కేంద్రాలను పరిశీలించిన.. జూన్ రెండున జెండా ఆవిష్కరణ, 6నుంచి 19వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాల్లో ఏకరూప దుస్తులు, రాత పుస్తకాలు అందించేదుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

పెనుబల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎనినకల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ వికాస్ లోన్లు రాజకీయాలకు అతీతంగా ఇవ్వాలని, పోడు సాగుచేసుకుంటున్న రైతులకు కరెంటు మోటార్లు ఇవ్వాలని, ఎస్సీ, బీసీల పోడు సాగుదారులపై ఫారెస్టు దాడులు ఆపాలన్నారు. అనంతరం సిబ్బందికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరావు, చిరంజీవి, సత్యం, విశ్వనాథం, ప్రసాద్, నాగమణి, బాబు, అరుణ్‌ప్రతాప్, నీలమ్మ, విజయకుమారి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తాం

ఘనంగా సుందరయ్య వర్ధంతి



వైరా: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైరా/కొణిజర్ల/ఏన్కూరు: కమ్యూనిస్టు ఉద్యమ నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.సోమయ్య, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పేర్కొన్నారు. సోమవారం వైరా, కొణిజర్లలోని కొండవనమాలలో, ఏన్కూరులో నిర్వహించిన పెచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాల్లో వారు పాల్గొని సుందరయ్య విగ్రహాలను ఆవిష్కరించడంతో పాటు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహించడమే సుందరయ్యకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమాలల్లో సీపీఎం నాయకులు సత్యనారాయణ, చలపతిరావు, సుధాకర్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, అంజయ్య, కృష్ణ, కృష్ణయ్య, వెంకయ్య, కుటుంబరావు, రమేష్, రమాదేవి, బాలాజీ, మండల కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మధిరలో..

మధిర: మధిర బోడెపుడి భవన్‌లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి, మడుపల్లి గోపాలరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహారావు, సైదులు, రామనర్సయ్య, రాధాకృష్ణ, సుందరయ్య, షకూర్, మధు, సాహెబ్ పాల్గొన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో..

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి/కల్లూరు/తల్లాడ: సీపీఎం పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి, కల్లూరులోని సీపీఎం కార్యాలయాల్లో, పెనుబల్లిలోని వీయంబంజర్ రింగ్ సెంటర్లో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా తల్లాడలోని గోపాలపేటలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీల మధ్య సుందరయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలామల విఠల్‌రావు, డివిజన్ కమిటీ సభ్యుడు తన్నీరు కృష్ణార్జునరావు, సీపీఎం నాయకులు సర్వేశ్వరరావు, పాండు, వెంకట్రావ్, రమేష్, శ్రీహరి, రత్నకుమారి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, రఫీ, రిటైర్డ్ జడ్జి దేవమందిరం, రిటైర్డ్ ఉపాధ్యాయులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశ్వరరావు, స్వామి, బుడ్డయ్య, చిరంజీవి, సత్యం, రాజేశ్వరరావు, కృష్ణ, ముదిగుండ అంజయ్య, నాగేశ్వరరావు, రామనాథం, వెంకటి, నరసింహారావు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సత్యనారాయణ, నాగేశ్వరరావు, గోపాల్‌రావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మధిర: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు